

# అవసరం తీరింది!

శ్రీ పెనుమర్తి కామేశ్వరరావు.

రాత్రి పన్నెండు గంటలైనా, విశ్వనాథానికి నిద్ర పట్టలేదు. విశ్వనాథం బి. యే. తప్పి రెండు సంవత్సరాలైంది. బి. యే. పాసయినా ఉపయోగంలేదని పరీక్షకోసం తిరిగి చదవడం మానేశాడు. పదెకరాల మాగాని భూమివుంది. ఏ పుస్తకాల షాపులోనో, ప్రపంచంలో గౌరవ మర్యాదలకంటే, ధనమే ముఖ్యంగా యెంచుకుని యెంత అన్యాయానికైన సాహసించే ఏ ధనవంతుడి దగ్గరనో అతనికి వుద్యోగం చేయడానికి యిష్టంలేదు. బ్రదికిన మూడునాళ్లూ గౌరవంతో, పేరు ప్రతిష్టలతో బ్రతకాలనీ, జీవితానికి ధనం ఎక్కువ ముఖ్యమైనది కాదనీ అతనివుద్దేశ్యం. ఏదైనా ఆదర్శ పూర్వకమైన పని చేయాలని ఆతనివాంఛ. మనుష్యుడు కోరినదల్లా యెలా సఫలమౌతుంది? ఇరవైయెనిమిది వత్సరాలవయస్సు అతనింకా వివాహం చేసుకోలేదు. వివాహం చేసుకుంటే, దేశసేవ చేయడానికి చాలా అడ్డమనీ, ఎప్పుడో తన యిష్టమొచ్చినప్పుడు, తన కనుగుణమైన స్త్రీని చక్కగా చదువుకున్నదానిని వివాహమాడి, సుఖపడాలనీ నిశ్చయించుకుని, ప్రశాంతంగా జీవితం గడుపుతుండేవాడు.

ప్రతి మానవుడికివలె, అతనికి కూడా జీవితంలో కావలసినంత అనుభవం కలిగింది. అతను ఒక్కడూ ఒంటరిగా గదిలో నివసించుచుండేవాడు. ఒకొక్కరోజున అతనికి సముద్రపు టలలవలె, కోరికలు కలి

గేవి. బ్రహ్మచారిగా వుండడం దుర్భరమైన విషయంగా తోచేది.

కాని యేంచేస్తాడు? ధైర్యంచేసి, ఏపనీ చేయలేని అసమర్థత అతన్ని పూర్తిగా వరించింది.

విశ్వనాథం యెంత మంది స్త్రీలనో ప్రేమించాడు. కాని ఒకచోటా అతనికి విజయం చేకూరలేదు. అతనికి ప్రపంచం అంతా ఒక వింతగా తోచేది. ఏమీతోచక, అతను చాలసార్లు దేశాటనము చేసి వచ్చాడు. చాలా డబ్బు ఖర్చుపెట్టి ఉద్యోగం లేనందున, ఖర్చు ఎక్కువ కావడంవల్లనూ అప్పులు యెక్కువై పోయినయి.

ఆరోజు రాత్రి యెంత ప్రయత్నించినా నిద్రరాలేదు. పూర్వం జరిగిపోయిన సంగతులేవో జ్ఞాపకం రా సాగినయి, ఒకదాని వెంట ఒకటి. అందుచేత విశ్వనాథం మనసును మార్చుకునేదుకు ఒక సిగరెట్టు వెలిగించుకుని బెంగాలీలాల్చి వేసుకుని వెన్నెట్లో షికారు బయలుదేరాడు. పండువెన్నెల కాస్తోంది. చల్లనిగాలి వేస్తోంది. ప్రకృతంతా గాఢ సుషుప్తిలో లీనమైయుంది. ఆ నిశాసమయంలో అతనికి తనొక్కడూ ప్రపంచం చేత విడిచి పెట్టబడినజీవి, అనిపించింది.

ఆకాశంవైపు చూస్తూ, షెల్లీ రచించిన దుఃఖగీతాలు మననం చేసుకుంటూ ఒంటరిగా నడిచి పోతున్నాడు. కొంతదూరం పోయే టప్పటికి అతనివెంట యెవరో వ్యక్తి నడచి వస్తున్నట్టు గోచరించింది. వెంటనే అతడు వెనక్కు తిరిగి చూశాడు. ఒకస్త్రీ నెత్తిన ముసుగు వేసుకుని నడుస్తూ వస్తున్నది. ముత్తైదువ. అతను ధైర్యంతో రోడ్డుమీద ఆగాడు. ఆస్త్రీ అతనిని సమీపించి, అతనిని దాటి ముందుకు నడచిపోయింది. అతనామెవెంట నడువసాగాడు. పదిగజాలు ఇద్దరూ మౌనంగా నడిచి వెళ్లారు.

విశ్వనాథం: ఏవరా వెళ్ళేది?

ఆమె యెందుకు?

వి:-పనుంది ఆగు.

ఆ:-ఏమిటి పని? అని ఆగింది. విశ్వనాథం వెన్నెట్లో ఆమె ముఖం వైపు చూచి 'నువ్వా? ఏక్కడికి పోతున్నావు?

ఆ:-మా వాళ్ళింటికి.

వి:-దేనికి?

ఆ:-పనుంది. ఎందుకు మీకీ వివరాలు?

వి:-పనుంది, ఒక విషయం అడుగుతాను, చెప్తావూ?

ఆ:-'ఆ' అని తల ఆడించింది.

వి:-నాగదికి పోదాం వస్తావా? అన్నాడు ధైర్యంచేసి.

ఆ:-దేనికిప్పుడు? అన్నది కోపంతో.

వి:-దేనికేమిటి? పోదాం, రా. అని ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమెకొంచెం కూడా జంకలేదు. అధైర్య పడలేదు. విశ్వనాథంతో వెనక్కు తిరిగి నడవ సాగింది. ఎవరామె? విశ్వనాథం అద్దెకుంటున్న ఇంటి ప్రక్కడాబాలో కాపురం వుంటున్న లావాటి ఆయన రెండవ భార్య, కమల.

కొంతదూరం ఎవరూ ఏమీ మాట్లాడకుండా నడిచారు.

వి:-మీ వాళ్ళింటికి యేదైనా అవుసరమైన పనుండి వెళ్తున్నావా?

క:-అవును.

వి:-ఎవరు నీవాళ్ళు?

క:-మీ రెరగరు.

వి:- పోనీ లే; నే బజార్న వెళ్తూంటే, నువ్వెన్నిసార్లో మీ వాకిల్లోనుంచి నావైపు ప్రేమతో చూస్తూండే దానివి. నేను చాలా సార్లు గమనించాను. నీకు నాయందు నిజంగా ప్రేమలేదూ?

క:-నాకు తెలియదు.

వి:-నీకు తెలియకేం? నీకు తెలుసు, ఆహా! ఈ వెన్నెల యెంత మనోహరంగావుంది. నువ్వు ప్రేమతో నన్ను చూస్తున్నప్పటికీ, నే నది లెఖ చేయకుండా నడిచిపోయేవాడ్ని, పోనీ, అది నీకు తెలుసునా?

క:-ఎందుచేత?

వి:-ఆడవాళ్లకు చలనబుద్ధి ఎక్కువ. ఎన్నిసార్లు, పొరపాటు పడ్డాను. కొన్నాళ్లనుంచి, అసలు ఆడవాళ్లంటే, నేను వట్టినీచులుగా భావిస్తున్నాను.

క:-ఆడవాళ్లు మగవాళ్ళకంటే నీచులుకారు. మీకు వివాహం అయిందా?

వి:-కాలేదు, ఎందుకు?

క:-ఏమీలేదు. నాకు జీవితం చాలా దుర్భరంగావుంది.

వి:-వుంటుంది. అంత లావాటాయనతో కాపురం చేయడం యేఆడదానికైనా దుర్భరమే.

క:-నాకేమీ తెలియని రోజుల్లో మావాళ్లు ఆయనకు అంటగట్టారు, ఎంతబాధ అనుభవిస్తున్నానో, అభగవంతుడికే తెలియాలి.

వి:-ఇక ఫరవాలేదు, నా తో వుండిపో, నిన్ను నా హృదయ సింహాసనంమీద వుంచుకుని పూజిస్తాను.

విశ్వనాథం నూతనంగా రేకెత్తిన వుద్రేకంతో, నివురుగప్పిన వుత్సాహంతో అణచుకోలేని ఆనందంతో, తడబడుతూ గదితాళందీసి లోపల ప్రవేశించాడు.

'రా, లోపలికి; దీపం వెలిగిస్తా' అన్నాడు.

కమల మారుమాటాడకుండా లోపలికి వెళ్ళింది. వయసు సుమారు ఇరవై రెండు. చామనచాయి శరీరం. విశాలమైన నేత్రాలు సినిమానటి సులోచన ముక్కువంటి ముక్కు, బర్మాముడి, బాడి, దానిపైన ఉల్లిపొర సిల్కు జాకెట్టు, పట్టంచు కాఫీ కలరు చీరె, కాళ్ళకు గొలుసులు. చేతులకు నాల్గు జతల గాజులు. మెళ్ళో మూడుపేటల బంగారపు చంద్రహారం, గొలుసు.

విశ్వనాథం ఒక నిమిషంలో దీపం వెలిగించాడు. కమల క్రిందుకూర్చుని వుంది.

వి:-అదేమిటి క్రింద కూర్చున్నావు. క్రిందంతా దుమ్ముగావుంది. మంచంమీద అనిఆమె చేయిపట్టుకుని మంచము మీద కూచోబెట్టి, ఆమె యెదను పరీక్ష చేస్తూ, 'నన్నీహృదయంలో దాచుకుంటే, నిన్ను నా హృదయంలో వుంచుకుని, నీ దాసానదాసుడనై నిన్ను కొలుస్తాను.' అన్నాడు.

కమల ఒక చిరునవ్వు నవ్వింది. రాత్రి మూడు గంటలు కొట్టింది. కమలకు నిద్ర మెలకువవచ్చింది. విశ్వనాథం ఆమె మీద చేయివేసి గాఢంగా నిద్రపోతున్నాడు. కమల వెంటనే లేచి, విశ్వనాథాన్ని లేపింది. విశ్వనాథం కలతనిద్రతో లేచి, 'మాట్లాడక పడుకో' అన్నాడు.

కమల చిరునవ్వుతో, 'లేవండి, పనుంది' అన్నది.

విశ్వనాథం లేచి కూర్చున్నాడు. కమల అతని బుజంమీద చెయివేసి,

'నన్ను తెల్లవారుజాము మెయిలుకు ఎక్కడికైనా తీసుకవెళ్ళండి. ఈ వూళ్ళోనేవుంటే అల్లరవుతుంది. నాథర్త నన్ను శిక్షిస్తాడు. ఇక మీకు కనపడనుకూడా,' అన్నది తడబడుతూ.

ఆమె మాటలకు విశ్వనాథానికి బాగా మెలకువవచ్చింది. దీపం వెలురులో ఆమె ముఖంలో కనపడే ఆదుర్దా, అమాయకత్వమూ చూచాడు విశ్వనాథం. అతని హృదయం కరిగిపోయింది.

వి:-ఎక్కడికి తీసుకపోను? చెన్నపట్టణం పోదామా?

క:-ఎక్కడికోఅక్కడికి కొంచెం దూరంగావుంటేనే నయం.

వి:-మీ ఆయన పోలీసు రిపోర్టు యిస్తాడేమో?

క:-యిస్తే యిస్తాడు. ఆలస్యం చేయబోకండి. మీ దగ్గర డబ్బు వున్నదా?

వి:-పదిహేను రూపాయిలు మటుకు వున్నాయి. మెయిలులో బెజవాడకు వెళ్ళి అక్కడ్నించి వుదయం ఎక్స్‌ప్రెస్‌లో మద్రాసు వెళ్ళుదాం.

క:-సరే, లేచి త్వరగా గుడ్డలు సర్దండి.

విశ్వనాథం త్వర త్వరగా గుడ్డలు సర్దాడు ట్రంకుపెట్టెలో. పరుపు 'హోల్డాల్'లో కట్టేశాడు. కమల పెట్టె తీసుకుంది. విశ్వనాథం 'హోల్డాల్' తీసుకున్నాడు. గదికి తాళంవేసి మెయిలుకు బయలుదేరి వెళ్లారు. తెల్లవారు జామది. ఎక్కువ చలిగావుంది. వుంటే యేం?

౨

విశ్వనాథానికిదంతా ఏదో స్వప్నంలో జరుగుతున్న ఒక కథగా కనిపించింది. హృదయంలో వాడిపోయిన కోర్కెలన్నీ, ఒక్కసారిగా ప్రణయామృతసేచనమున మళ్లీ పుష్పించినయి. ఇక జీవితం అనంతానంద స్వర్గపదవిలో మునిగిపోతుందన్న ఒక ధైర్యమే అతన్ని కార్యసూరుడ్ని చేసింది. ఏపని చేయడానికైనాఅధైర్యముతో వెనుదీసేవాడికి, ఆ నాటి సంఘటన చాలా వింతగా కానుపించింది.

కమలకుకూడా తన పూర్వజన్మ సుకృతం ఫలించినట్లు తోచింది. దుర్భరమైన బాధలుతొలగిపోయినట్లుగా భావించుకుంది. ఆనందాధిదేవతగా, ప్రేమసామ్రాజ్య కిరీటాధిపతురాలుగా కానున్నందుకు మిక్కిలి సంతోషపడింది.

కమలకు రైలుస్టేషనువద్ద ఎరిగినవాళ్ళెవరైనా కనబడుతారేమో నన్న భయం వేసింది. కాని అదృష్ట వశాత్తు, ఎవరూ కనుపించలేదు. ఆ తెల్లవారుజాము మెయిలుకు బెజవాడకు బయలుదేరి పోయి, అక్కడ ఉదయం ఎక్స్‌ప్రెస్ ఎక్కి మద్రాసు వెళ్ళాలని వాళ్ల వుద్దేశం.

బెజవాడ స్టేషనులో రైలు ఆగింది. 'ట్రంకు హోల్డాలు కూలి

వాడి నెత్తినపెట్టి, పాసెంజరు పెట్టెలోకి వెళ్ళారు. ఎక్స్‌ప్రెస్ వచ్చు వరకు అక్కడ వుండాలని అనుకున్నారు. విశ్వనాథం వెళ్ళి, కాఫీ హొటల్‌నుంచి, ఇడ్డెన్లు కాఫీ తీసుకవచ్చాడు. ఇద్దరూ పుచ్చుకున్నారు. ఒకరి ప్రక్కన ఒకరు, ఒకరిపైన ఒకరికివున్న అమిత ప్రేమతో చూచుకుంటూ, ఒక బల్లమీద కూర్చున్నారు. అప్పుడు యేబళ్లూ వచ్చే సమయం కానందున ఆ పెట్టెలో ఎక్కువమంది జనంలేరు.

వి:—మా ఆయన వూళ్ళో వున్నాడా నిన్న?

క:-లేదు. వూరికి వెళ్ళాడు. ఇవాళ వస్తాడు.

వి:-వచ్చిం తరువాత యేమనుకుంటాడో? మీయింట్లో ఆడవాళ్లు యింకా యెవరూలేరూ?

క:-లేరు.

వి:-నిన్న నువ్వు వెళ్తున్నది ఎవరికోసం? నీ వెవరినైనా ప్రేమించావా?

క;-లేదు. ఎవరినైనా ప్రేమిస్తే మీ వెంట యెందుకొస్తాను? నిన్న రాత్రి, మీరు నాపాలిటి దేవుడువలె కన్పడకపోతే,...

వి:-కన్పడక పోతే...

క:-చచ్చిపోయేదాన్ని.

వి:-నిజంగా! ఆడవాళ్ళు ఎంత సాహసమైనా చేస్తారు!

క:-ఎందుకు చేస్తారు? పరిస్థతులు మారితే, మనసుకు యిటువంటి ఆలోచనలు కలుగుతయి.

వి:-నీ చీరెలు, రెవికలు, అన్నీ ఇంట్లోనే వుండిపోయినయి.

క.-మద్రాసులో కొనవచ్చులేండి.

వి:-ఏంపెట్టి కొంటాం నాదగ్గర పదిహేను రూపాయ లున్నాయి. వెళ్ళగానే వెంటనే వుద్యోగం కుదురుతుందా?

క:-మీకేం ఫరవాలేదు. మీ కుద్యోగం దొరికేటంతవరకు నా వస్తువులు...

వి:-నీ వస్తువులు అమ్మడానికి నా కిష్టంలేదు.

క:-అన్నీ కాదు,- వకజత గాజులమ్మితే కావలసినంత డబ్బు ఆ డబ్బుతో మనం శుభ్రంగా యెంత కాలమైనా మద్రాసులో వుండొచ్చు మీకెంత పొలం వుంది? అన్నది. ఇద్దరికీ ఆదే ప్రథమ పరిచయం. ఒకరిని గురించి ఒకరు తెలుసుకోవలసిన విషయాలెన్నో వున్నయి. ముందు ముఖ్యమైన విషయాలు సందర్భాన్ని అనుసరించి ఒక్కొక్కటే బయటికి వస్తున్నయి. విశ్వనాధానికి ఆస్తి బాగావుంటే, అతను ఉద్యోగంకూడా చెయ్యనక్కర లేదు. ఎప్పుడూ తన సమక్షంలో వుండి పోవచ్చు. ఇద్దరూసౌఖ్యం అనుభవించడానికి ఇదే ప్రథమ పర్యాయం. ఈ ఆనంద సమయంలో ఒకరొకరి యెదల్లో కరుళ్ళు కట్టిన వాంఛలన్నీ తీరేవరకూ ఎడబాటు వుండకూడదు. కమల వేసిన ప్రశ్న విశ్వనాధానికి ఆశ్చర్యంకలుగ జేసింది.

వి:-ఎందుకు? అలా అడిగావు?

క:-ఏమీలేదు తెలుసుకుందామని.

వి:-పదెకరాల మాగాని భూమి.

క:-ఇంకా కావలసిందేమిటి అన్నది. ఆమెలో ఆనందంపొంగి పొర్లింది. ఇలా తను పరాయి మగవాడ్నినమ్మి బయలుదేరిరావడం,ఆమెకు వింతగా కనుపించలేదు. తప్పని అవసరం. ఆత్మకానందం లేకుండా, యేజీవైనా ఎంతకాలం బ్రతకగలదు?

కమల ఆరు వత్సరాలు నిరంతరంగా అనుభవించింది విరహం. మనోవ్యథ; అసంతృప్తి. ఏమిటి దారని రాత్రింబవళ్లు ఆలోచించింది. చివరకు ఈ మార్గం దొరికింది. తన పుట్టింటివారు, తన అత్తింటివారూ, తన మూలకంగా సంఘంలో అమర్యాద పాలవుతారని ఆమెకు కించిత్తుకూడా సందేహం కలుగలేదు. విశ్వనాధానికి కూడా తనొక్కడూ ఒంటరిగా జీవితంలో ఏ మార్గం త్రొక్కడానికి పాలుపోక అవస్థపడుతుండే రోజుల్లో, కమల గాఢ ప్రణయ కల్లోల జలధిలో తన జీవితనౌకను ఒడ్డుకుచేర్చే నావికురాలుగా తోచింది. తన ప్రతిష్టకు గానీ, తన గౌరవానికీగాని, తను చేసిన యీ తప్పుపని యేవిధంగానూ భంగకారి కాదని అతనికి తోచింది.

ఎనిమిది గంటలైంది. బెజవాడ స్టేషన్‌లో 'ఎక్స్‌ప్రెస్' ఆగింది. విశ్వనాథం, కమలా సామానుతో ఒకచిన్న పెట్టెలో ఎక్కారు. విశ్వనాథం కమలా, తెనాలి స్టేషన్‌లో ఎరిగిన వాళ్ళెవరైనా తమ పెట్టెలో ఎక్కుతారేమోనని చాలా భయపడ్డారు. అందుకోసం ఆపెట్టె కిటికీ తలుపును మూసి, తలుపురాకుండా, దానికి అడ్డంగా సామాన్లు వుంచారు. కాని ఎవరూ ఎక్కలేదు.

ఇద్దరూ సాయంకాలం అయిదు గంటలకు మద్రాసు చేరుకున్నారు.

## 3

రాయపేటలో, మారుమూలగా వుండే 'మీర్సాబ్‌పేట'లో ఒక యిల్లు 8 రూపాయలకు అద్దెకు తీసుకున్నారు. విశ్వనాథం బజారుకు వెళ్ళి జతగాజులు అమ్మి డబ్బుతీసుకుని, ఇంట్లోకి కావాలసిన సామానంతా- మట్టిపొయ్యి ఒకటి, కట్టె పుడకలు, ఉప్పూ, చింతపండూ, మిరపకాయలూ- బియ్యం- నెయ్యి- నీళ్ళు కాచుకునేందుకు కాగూ, వంటకు గిన్నెలూ- అన్నీ కొని తీసుకొ వచ్చాడు.

మొదట విశ్వనాథం ఈవంట గోలలేకుండా, హొటల్నుంచి టిఫిన్ కారియర్ తెప్పించుకుందామన్నాడు. కాని కమలే వద్దన్నది. కమలకు వంటచేయడం అంటే చాలా సరదా!

అరవవాళ్ల వంటల్లో, ఉప్పూ, కారం సరిగాపుండదనీ, కావలసినప్పుడల్లా వేడినీళ్ళు పెట్టుకోవలసిన అవసరం వుండడంవల్లా స్వంతంగా వంట చేసుకోవడమే ఇద్దరూ నిర్ధారణ చేసుకున్నారు.

ప్రతిరోజూ- పెందరాడే పదిగంటలకు వంటచేసేది కమల. అంతవరకూ విశ్వనాథం 'హిగిన్‌బాథమ్సు' లో కొన్న ఒక నవల యేదో చదువతూ వుండేవాడు. వంట కాగానే, ఇద్దరూ పింగాణీ కంచాల్లో భోజనం చేసేవాళ్ళు. వెంటనే వంటఇంట్లో సామానుసర్ది, పచ్చళ్ళమీద, పెరుగుమీద, నెయ్యిమీద మూతలు పెట్టి కమల పకుకునే గదిలోకి వచ్చేసేది. తమలపాకులను జాగ్రత్తగా ఈనెలు తీసి, సున్నంరాసి, చిలకలు చుట్టి విశ్వనాథంకు యిచ్చేది. అతను ఒక్కొక్కటే అందుకుంటూ, ఆమె శ్రద్ధనూ, ఆమె నిష్కల్మషమైన ప్రేమనూ తిలకించుతూ, లోలోన ఆనంద పడేవాడు.

క్రొత్తగాకొన్న సిల్కు పరుపు మీద ఇద్దరూ ఒకర్ని ఒకరు కావిలించుకుంటూ ముద్దు పెట్టుకుంటూ ఒళ్ళు తెలియని పారవశ్యంలో సాయంత్రం నాల్గు గంటలవరకూ గడిపేవాళ్ళు, కమల విశ్వనాథం మెడచుట్టూ చేతులువేసి, చెక్కిళ్ళు ముద్దులు పెట్టుకున్నప్పుడు, ఆమెకు తన భర్త సుబ్బారాయుడి బుర్ర మీసాలు, లావాటి చేతులు జ్ఞాపకమొచ్చేవి; తనుభర్తతో జీవితం గడిపిన రోజుల్లో అనుభవించిన అసంతృప్తి, యిప్పుడు దనుభవిస్తున్న ఆనందం, వీటివ్యత్యాసం లోలోపల ఆమెకు ప్రశాంతిని కలుగచేస్తున్నట్లు తోచేది.

సాయంత్రం కాగానే, ఇద్దరూ చక్కని దుస్తులు ధరించి ఏ కాఫీ హొటల్లోనో, టిఫిన్ తీసుకుని, సినిమాకో, లేక బీచికో వెళ్ళేవాళ్ళు, మద్రాసులో ఉద్యోగం చేస్తూ, ఒంటరిగావుంటూ జీవితం గడుపుతున్న యువకులకు వాళ్ళిద్దర్నీ చూస్తే ఆశ్చర్యంగా వుండేది; వాళ్ళకు మనసులో అనేక కోరికలు కలిగి, వాళ్ళను ఎగాదిగా వెర్రిగా చూసేవాళ్ళు ఏ సినిమాకో వెళ్లితే, రాత్రిపొద్దుపోతే, ఒక్కొక్కప్పుడు యే హొటల్లోనో భోజనంచేసి, ఇంటికి చేరుకునేవారు. ప్రతిరోజూ విశ్వనాథం తన జీవితం అంతా ఆమె సమక్షంలోనే గడుపుతుండేవాడు. ఆమె లేకుండా యెక్కడికీ వెళ్లేవాడు కాదు, సామాన్లుకొనే బజారుకుతప్ప.

ఒకరోజున రాత్రి భోజనా లయింతరవాత, వెన్నెట్లో చాపేసుకుని ఇద్దరూ కూచున్నారు.

క:-మీ రింతవరకు వివాహం చేసుకోకుండా ఎందు కున్నారు?

వి:-నీ కోసం......

క:-అంతా వట్టిది. అని నవ్వింది. నన్ను మీ రెన్నాళ్ళనుంచి ఎరుగుదురు?

వి:-సుమారు ఒక సంవత్సరం నుంచి.

క:-ఇంతేగా, ఇంతకు ముందు?

వి:-ఇంతకుముందు, అనేక సంబంధాలు వచ్చినయి. ఒకపిల్లా నాకు నచ్చలేదు. అందమైన పిల్ల ఒక్కరేనా నాకు కనపడలేదు.

కమల తన్ను అందగత్తె అని అతను భావిస్తున్నందుకు తనలోతను తృప్తిపడ్డది.

క:-ఆడపిల్లలు చిన్న తనంలో అందంగా కనబడరు. వయిసువచ్చింతరువాత, అందంగా వుంటారు.

వి:-అవును, మనంవచ్చి, వారంరోజు లయింది. నిన్ననో మొన్ననో వచ్చినట్లుంది. దినములు పూరికే తొందరగా గడిచిపోతున్నట్లుగా తోస్తుంది నాకు. తొందరగా యేదైనా వుద్యోగం దొరికితే బాగుండును.

క:-మీరూరికే ఆదుర్దాపడకండి, ఉద్యోగం ఎందుకు దొరకదు? ఇప్పుడేం తొందర? ఇంకా డబ్బుందిగా!

వి:-డబ్బంతా అయిపోయిం తరువాత ఉద్యోగం కావాలంటే

వెంటనే కుదురుతుందా? ఇప్పటి నుంచీ ప్రయత్నంచేయాలి.

క:-సరే చేస్తుండండి అన్నది కమల.

విశ్వనాథానికి కమల వస్తువులు అమ్మి, ఆ డబ్బుతో బ్రతకడం ఇష్టం లేదు. ఇంటికివెళ్లి డబ్బు తీసుక రావడానికి మనస్కరించలేదు. కమలను ఒంటరిగా వదలిపెట్టి వెళ్ళడం అతని కిష్టంలేదు. రెండవది, తను యిట్లా ఫలానా మనిషిని లేవతీసుక పోయినట్టు తనవాళ్ళకు యేవిధంగానైనా తెలిసి వుంటుందని అతని అనుమానం! అందుచేత తను యింటికి వెళ్ళగానే, తన మిత్రులూ తన బంధువులూ, అనేక విధాలుగా దూషిస్తారని అతనిభయం.

మనసుకు ఏ చీకూ, చింతా లేకుండా జీవితంలో ఒకరోజు గడిపితేనే చిరకాలం మనకు ఆరోజు జ్ఞాపకం వుంటుంది. ఇద్దరూ ఒక్కొక రోజున, బీచికివెళ్ళి రాత్రి తొమ్మిది గంటలదాకా ఇసుకమీద ఒకరి కొకరు దగ్గరగా కూచుని సమీపంలో మనుష్య సంచారంలేని ప్రదేశంలో సముద్రపుటలల హోరు వింటూ వెన్నెలతో నిండిన ఆకాశాచ్ఛాదనం క్రింద కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కాలంగడిపేవాళ్ళు. విశ్వనాథం కమలకు పిల్లలను పెంచడంగురించీ, సంఘంలో ఉన్న దురాచారాల గురించీ, వయసుమళ్ళిన వితంతువుల ఆచారంగురించి వారు చాటుగా చేసే అవినీతికరమైన పనులుగూర్చి సంఘం అటువంటి వార్నందర్నీ ఎలా గౌరవించేదీ-ఈ విషయాలన్నిటి గూర్చి ఉపన్యాస ధోరణిలో మాట్లాడేవాడు. పాపం కమలకు ప్రపంచం గురించీ ఏమీ తెలియదు. నరసారావుపేట తాలూకాలో ఒక కుగ్రామంలో ఒక బీదయింట్లో పుట్టి తెనాల్లో పౌరోహిత్యం చేసుకుని బ్రతికే ఒక బ్రాహ్మడి భార్య అయి, అవస్థల ననుభవించడంలోనే అప్పటివరకు ఆమె జీవితం లీనమై వుంది. ఈ విషయాలన్నింటిగురించీ విశ్వనాథం అనేక సంగతులు యథార్థములు నైతికంగా చాలా ఘోరమైనవి చెపుతుంటే కమలకు మరో ప్రపంచం చూస్తూన్నట్లుగా తోచేది.

వి:-సంఘం ఇంత బురదగుంట అని ఎవడైనా రచనలలో చూపిస్తే బురదగుంటంతా తమహక్కు భుక్తములని అనుకునేవాళ్లకు కళ్ళెర్రి. సంఘాన్ని బాగుచేయాలని మన కథకుల్లో కొందరు చేస్తున్న ప్రయత్నం ఎంత గొప్పదో తెలియక ఆ కథలన్నీ అవినీతిని బోధిస్తున్నాయని ప్రచారం చేస్తున్నారు కొందరు. అటువంటి వాళ్లని ఏ స్టాలినో అయితేనా? వెంటనే ఉరికంబం ఎక్కించేవాడు.

క:-స్టాలిన్ అంటే ఎవరు?

వి:-రష్యా దేశానికి నియంత రష్యాదేశంలో అతనిమాట ఒక్కటే చెల్లుబడి అవుతుంది. అతనికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే, వాళ్లకు వెంటనే మరణదండన.

క:-అతడంత దుర్మార్గుడు కావాల్ను.

వి:-అవును దుర్మార్గుడే. అతనంత దుర్మార్గుడు కావడంవల్లనే పాశ్చాత్యుల అభూతకల్పనలను, పాశ్చాత్యుల రాజ్యతంత్రములనూ ఎదుర్కొన గలుగుతున్నాడు. అతడు సామాన్య మానవుడే అయితే, రష్యాదేశాన్ని ఏ పాశ్చాత్య దేశమో జయించడంకోసం దేశంలో అనేక విభేదాలు కల్పించివుండేది. అంత గొప్ప శక్తివున్నవాడున్నాడు కాబట్టే, రష్యాను ఏదేశం ఏమీ చేయలేకుండా వున్నది అన్నాడు.

ఆరాత్రి 10-గంటలు ప్రొద్దుపోయేవరకూ అక్కడేవుండి, ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

## ౪

విశ్వనాథం, కమల మద్రాసు వచ్చి పదిరోజులైంది. ప్రతిరోజూ ఒకక్షణంగా గడిచిపోతోంది. ఇద్దరికీ జీవితమంతా ఇలా గడిచిపోతే బాగుండు ననిపించింది.

విశ్వనాథానికి ఏ సమయాన ఏమి తటస్థిస్తుందో అన్న అనుమానం మనసులో లేకపోలేదు. కాని అతనెప్పుడూ తన మనస్థితి ఆమె కెరిగించలేదు. తను యేవూళ్లో ఎన్నాళ్లవున్నా అడిగేవాళ్ళు లేరు. కాని కమల ఒకడి భార్య-పుట్టింటికి వెళ్లకుండా భర్తవద్ద వుండకుండా ఎక్కడికో వెళ్లిపోతే ఆమె భర్తా, తలిదండ్రులూ ఎలా వూరుకుంటారు? ఆమెకోసం విచారించకుండా ఎలా కూచుంటారు?

ఆరోజు సాయంత్రం 4 గంటలైంది. విశ్వనాథం పైజామా టెన్నిస్ కాలర్ షర్టు తొడుక్కునితల దువ్వుకుంటూ,

'కమలా, ఇవాళ మనం ట్రిప్లికేన్ బీచికి వెళదాం.' అన్నాడు.

'సరే ఇవాళ అక్కడికే పోదాం మరి సినిమాకు పోదామన్నారుగా. సినిమాకు వెళ్లద్దూ?'

'సినిమాకూడా అక్కడికి దగ్గరే; అవును స్టార్‌లో 'మాయ' చూద్దాం అనుకున్నాం కదూ!'

ఇద్దరూ బయలుదేరి, కాఫీ తీసుకుని, ఒక రిక్షామీద అయిదు గంటలకు ట్రిప్లికేన్ బీచికి చేరుకున్నారు.

మద్రాసులో ట్రిప్లికేన్ బీచికి వున్న అందం, మరే బీచికీలేదు.

అక్కడికి వచ్చేజనం ఎక్కువగా అరవవాళ్లూ, తెలుగువాళ్ళూ, వేరుగడలై 'బట్టానీ' కేకలు వేసే కుర్రాళ్ళూ, రేడియో సంగీతం, సముద్రపుటలల ధ్వని ప్రతివాడికి ఆహ్లాదకరంగా వుండే చల్లనిగాలి- ఇవన్నీ అక్కడికి వెళ్లే మనుష్యులకు ఆ కాసేపు మనశ్శాంతిని కలుగచేస్తయి.

విశ్వనాథం కమలా సముద్రానికి దగ్గరగా తీరాన ఇసుకలో కూచుని సముద్రంవైపు చూస్తూన్నారు. అక్కడికి సుమారు ముప్పయి వత్సరాల మనిషి చామనచాయ శరీరం ఎగదువ్వడు క్రాప్ పొట్టిముక్కూ, మిడిగుడ్లూ దృఢమైన శరీరంగల ఒక మనిషి వాళ్ల దగ్గరగావచ్చి-

'కమలా!' అన్నాడు. కమల అతన్ని నిర్ఘాంత పోయి చూచింది. ఆమెకు కొంచెంగా కంపం కలిగింది. అదంతా ఎలాగో అణచుకుని, 'మామయ్యా! ఈ వూరు ఎప్పుడొచ్చావు?' అన్నది కమల. విశ్వనాథానికి యేదో జరగబోయే సంఘుకిది ప్రస్తావనగా కనుపించింది.

'నిన్న ఉదయం మెయిలులో వచ్చాను, ఇక్కడ కొద్దిగా పనుండి. నువ్వీవూరు ఎప్పుడొచ్చావు? నేను వచ్చేటప్పుడు తెనాల్లో దిగుదామనుకున్నాను. కాని తిరిగి యింటికి వెళ్లేటప్పుడు దిగుదామని యిటు వచ్చేశాను.' అన్నాడు, కమల విషయం ఏమీ తెలియనట్లు.

'నువ్విప్పుడు ఏవూరునుంచీ రావడం? నువ్వు బెజవాడలో ఉద్యోగంలో వున్నావు కాదూ?'

'అవును. ఆపని మీదే ఈ వూరు వచ్చాను' అన్నాడు.

'ఎవరీయన?' అన్నాడు విశ్వనాథం.

'మా హనుమంతరావు మామయ్య' అన్నది కమల. విశ్వనాథానికి అతన్ని చూచేటప్పటికి అనుమానం వేసింది. అతన్ని ఏవిధంగానైనా వదల్చుకుని వెళ్లాలనిపించింది. అదీగాక, సినీమా వేళయింది కూడా.

'ఈయ నెవరు?' అన్నాడు హనుమంతరావు.

'ఈయన మా మాష్టరుగారు, విశ్వనాథంగారు. చాలా చదువుకున్నవారు' అన్నది కమల అమాయికంగా.

'ఓహో, అలాగా' అన్నాడు హనుమంతరావు, నిదానంగా.

'మనం వెళదాం. సినీమాకు వేళ అవుతుంది' అన్నాడు విశ్వనాథం వివర్ణమైన మొగంతో.

'మీరు వెళ్లేది, ఏ సినిమాకు?' అన్నాడు హనుమంతరావు.

'మాయ'కు అన్నది కమల. విశ్వనాథం, కమల లేచారు సినిమాకు వెళ్ళడానికి. హనుమంతరావు 'నేకూడా వస్తాను' అని వారివెంట బయలుదేరాడు. విశ్వనాథానికి అతను తమ వెంటరావడం యిష్టంలేదు. అతన్ని ఏవిధంగానైనా తప్పించుకోవాలని అతని వుద్దేశ్యం. కమలతో మెల్లిగా అన్నాడు.

'ఏమిటి, ఆయన మనవెంట ఎందుకు రావడం?'

'ఏంవస్తే! రానీయండి' అన్నది కమల.

'అతను నీకోసం వచ్చాడేమో?'

'కాదు. అతను చాలా మంచివాడు. మా అమ్మకు సయాన తమ్ముడే' అన్నది కమల. విశ్వనాథం మరి మాటాడలేదు.' ముగ్గురూకలసి 'మాయ'కు వెళ్లారు. సినిమాకాగానే ముగ్గురూకలసి, హొటల్లో భోజనం చేసి, ఇంటికి వెళ్లారు.

విశ్వనాథానికి ఈ హనుమంతరావు తమ వెంట రావడం యెంతమాత్రం యిష్టంలేదు. అతను తమ వెంట వస్తుంటే, విశ్వనాథానికి ముళ్లమీద నడుస్తూన్నట్టుగా అనిపించింది. అతను కమలను వెతకడానికే మద్రాసు వచ్చి వుంటాడని విశ్వనాథానికి పూర్తిగా అనుమానం. లేకపోతే మద్రాసులో హనుమంతరావు కేంపని? విశ్వనాథానికి కమల ప్రవర్తనమీద కూడా అనుమానంకలిగింది. అతను మనవెంట యెందుకంటే, 'అతను చాలా మంచివాడు. మా అమ్మకు సయాన తమ్ముడే' అని సమాధానం చెప్పడం, అతను నేను తెనాల్లో వచ్చేటప్పుడు దిగుదామనుకున్నానని చెప్పడం, విశ్వనాథానికి- కమలకూ, హనుమంతరావుకూ అంతకుముందు తప్పక సంబంధంఉండి

తీరుతుందన్న– అనుమానం కలిగింది. విశ్వనాథం మనసంతా తుఫానులో నడి సముద్రంలో చిక్కుకొనిపోయిన పడవవలె నయిపోయింది. కమలకు తెలియకుండా, ఆమెతో చెప్పకుండా, యెక్కడికైనా సిద్ధార్థుడి మోస్తరు లేచి పోవాలనిపించింది అతనికి. ఇప్పుడు హనుమంతరావు ఎక్కడ పడుకుంటాడు? తనెక్కడ పడుకుంటాడు? ఇతన్ని వెంట తెచ్చుకోవడం, కొనుక్కొని తెచ్చుకున్న తద్దినంవలె వుంది. కమలతో అన్ని విషయాలు మాట్లాడాలనిపించింది.

కమల, ముగ్గురికీ మూడు పక్కలు వసారాలో వేసింది. మొదటిపక్కమీద విశ్వనాథం, అతనికి దగ్గరగా కమల. కమలకు నాలుగు గజాల దూరంగా హనుమంతరావు పడుకున్నారు.

రాత్రి పన్నెండు గంటలైంది. విశ్వనాథం మెల్లిగా కమలను చేత్తో లేపాడు. కమల విశ్వనాథంవైపు వొత్తిగిలింది. కళ్ళు నులుపుకుంటూ,

'ఎందుకు?' అన్నది కమల.

'లే, గదిలోకి ..' అన్నాడు విశ్వనాథం. ఇద్దరూ లేచి, పక్కచుట్టుగదిలో వేసుకున్నారు. హనుమంతరావు కదలకుండా, మెదలకుండా, అంతా గమనించి, మాటాడకుండా పడుకున్నాడు. అతనేం చేస్తాడు?

హనుమంతరావు వాకిట్లో వసారాలో, పడుకున్నాడని విశ్వనాథానికి తెలుసు. అయితేనేం? అతని అవసరం. విశ్వనాథం గదితలుపులు మూసాడు, గడియ వేసాడు.

'కమలా, నువ్వు చాలా అమాయకురాలివి. మీ మామయ్య తప్పకుండా నిన్ను వెతకడంకోసమే యీవూరు వచ్చాడు. అతన్ని మనం యేవిధంగానైనా వదల్చుకొనక పోతే, మనకు చాలా యిబ్బంది' అన్నాడు విశ్వనాథం.

'అతను ఎందుకొచ్చిందీ తేలుతుందిగా మీకు తొందరెందుకు? అతను రేపు వెళ్ళిపోతాడు. అతను ఇక్కడ కాపరం వుంటాడా?' అంది కమల.

'కాపరం వుండడు. కాని అతని వల్ల మనకు చాలా యిబ్బంది వుంది. అది నీకు తెలియదు' అన్నాడు విశ్వనాథం

'మీరు వట్టి అనుమానస్థులు' అంది కమల.

విశ్వనాథానికి క్రొత్తగా ఒక జబ్బు ప్రారంభమైంది– కమలమాట జవదాట లేకపోవడం; పగలూ, రాత్రీ ఆమెను విడిచి వుండలేక పోవడం; ఆమెకు దాసానుసాసుడై పోయాడు. విశ్వనాథం తన మాటలు కమల చెవికెక్కించుకున్నటుల తోచలేదు. ఆమె మార్గం అమెది. స్త్రీలకు మటుకు ఆలోచన లేదూ? విశ్వనాథానికి తనమాటలు అర్థం చేసుకోకపోయినా, కమల తను నిద్ర లేపగానే గదిలోకి రావడం వల్ల అతని మనసులో తుఫాను తగ్గిపోయింది. కమల ఆరాత్రి విశ్వనాథానికి మామూలు కంటె ఎక్కువ సుఖం యివ్వగలిగింది.

కమల తెల్లవారక మునుపే నిద్ర లేచి (ఆడవాళ్లు శక్తి స్వరూపిణులన్న మాట కొందరిలో యదార్థమనిపిస్తుంది. రాత్రంతా నిద్రలేక పోయినా, తెల్లవారకమునుపే లేచి, యింటిపనులు నిర్వర్తించడం స్త్రీలలో గొప్పశక్తి అని నిర్ధారణ అవుతుంది) వంటయింట్లో పనులు చేస్తోంది. బాగా తెల్లవారిం తరువాత హనుమంతరావు నిద్రలేచాడు. కమల అతనికి పళ్ళు తోముకొనడానికి పళ్ళపొడి సీసా, నాలిక గీచుకొనడానికి తాటాకు యిచ్చింది. విశ్వనాథం యింకా నిద్రపోతూనే వున్నాడు.

'అమ్మాయి కమలా! మీ అత్త యేదైనా మంచి చీరకొని తీసుకరమ్మన్నది. చీరెలనాణ్యం నాకు తెలియదు. మనం ఒకసారి బజారుకు వెళ్ళివద్దాం' అన్నాడు హనుమంతరావు.

భోజనం చేసింతరవాత మధ్యాహ్నం ఏ రెడింటికో బయలుదేరి పోవచ్చు ఈలోగా నువ్వు కాఫీ హోటలుకు వెళ్లి కాఫీత్రాగి, రెండు కప్పులు కాఫీ మా పనిదాని చేతికిచ్చి ఇంటికిపంపు; ఆయ నింకా నిద్రపోతున్నారు' అన్నది కమల. హనుమంతరావుకు కమల చెప్పిన పని కొంచెం జుగుప్స కలిగించింది. తాను అతిథిగా వస్తే కాఫీ తెప్పించి యివ్వడానికి బదులు ఈ యేర్పాటు వేసింది. హనుమంతరావు మరుమాటాడక,

'సరే, గ్లాసుయిచ్చి పనిదాన్ని పంపు' అన్నాడు.

హనుమంతరావు పనిచేసేదాన్ని తీసుకుని కాఫీ హోటలుకు పోయాడు. అతనికి విషయమంతా

రాత్రి పూర్తిగా అర్థమయింది. అందుచేత, పనిదాన్ని అతను కనుక్కోన వలసిన విషయాలేవీ లేవు. అదీగాక పనిదానికి తెలుగు బాగా రాదు.

విశ్వనాథం నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని కాఫీత్రాగి సిగరెట్టు ముట్టించుకుని, వూరికే ఆలోచిస్తూ కూచున్నాడు. హనుమంతరావు వసారాలో చాప మీద సినిమా పత్రికల్లో బొమ్మలుచూస్తూ కూర్చున్నాడు. కమల వంటయింట్లో వంటచేస్తోంది. విశ్వనాథం హనుమంతరావును పలకరించలేదు. హనుమంతరావు విశ్వనాథంను పలకరించలేదు. అప్పుడప్పుడూ, ఒకరినొకరు అదోమాదిరి చూచుకున్నారంతే!

మధ్యాహ్నం పదకొండు గంటలకు ముగ్గురూ భోజనాలు చేశారు. తాంబూలం వేసుకున్నారు. విశ్వనాథం ఒక్కడూ గదిలో పరుపు మీద ఏదో ఆలోచిస్తూ, సిగరెట్లు కాలుస్తూ, మధ్యమధ్య కాసేపు నవల చదువుతూ పడుకున్నాడు. కమల హనుమంతరావు వసారాలో కూర్చుని ఏవో కబుర్లు, వాళ్లబంధువుల్నిగూర్చి మాట్లాడుకుంటున్నారు.

హనుమంతరావు వచ్చినప్పటి నుంచీ, కమలమనసు మారినట్లుగా కనపడింది విశ్వనాథానికి. ఆడవాళ్లకు తనువైపు బంధువుల్ని చూస్తే, అపేక్ష యెక్కువ. విశ్వనాథం-హనుమంతరావు ఎప్పుడు వదిలిపోతాడా అని లోలోపల ఒకటే అవస్థపడసాగాడు.

మధ్యాహ్నం రెండుగంటలైంది. హనుమంతరావు.

'కమలా, రెండు గంటలైంది. మనం ఒకసారి బజారుకు వెళ్లివద్దాం' అన్నాడు. కమల తొందరగా సబ్బుతో మొగం కడుక్కుని జడ చుట్టు సరిగా చుట్టుకుని, బజారుకు బయలు దేరడానికి తయారు అయింది. విశ్వనాథంతో,

'నే నొకసారి బజారుకు వెళ్లి వస్తాను' అన్నది కమల.

'ఎన్ని గంటలకు తిరిగి యింటికి వస్తావు?'

'ఎందుకు?'

'అంతవరకు యింటిద్ద వుండమంటే వుంటాను. నువ్వు వచ్చిన తరువాత ఇద్దరంకలసి ఎక్కడికైనా పోదాం. ఆయన ఇవాళ వెళతాడుగా?

'అయిదు గంటలకు వస్తాను. బహుశా, అతను ఈరాత్రి బండికి వెళ్తాడనుకుంటాను' అన్నది.

హనుమంతరావు, కమల బయలుదేరి బస్సులు ఆగేచోటుకు నడిచి పోయారు. హనుమంతరావు కమలను సరాసరి' సర్దార్ భవనం హోటలకు తీసుక వచ్చాడు. దారిలో ఏమీ మాటలాడలేదు ఇద్దరూ.

'మనం యిక్కడకు వచ్చాము ఎందుకు?' అన్నది కమల.

'ఇక్కడ నా సామానువుంది. ఇక్కడ కాఫీత్రాగి వెళ్లి!చీరలుకొనుక్కువద్దాము ఇక్కడకు గుడ్డల దుకాణాలుదగ్గరే' అన్నాడు హనుమంతరావు కమలకు హనుమంతరావు మీద యే అనుమానమూ లేదు. కమల తన బాల్యంనుంచీ హనుమంతరావును యెరుగును. వాళ్ల వూరు వచ్చినప్పుడల్లా, హనుమంతరావు తనకు మిఠాయిపొట్లం తీసుక వచ్చి యిచ్చేవాడు

హనుమంతరావు కమలను తన గదిలోకి తీసుకవెళ్లాడు. గదిలో ఒక మంచం, ఒకకుర్చీ, టేబిలు, ఎలక్ట్రికులైటు, ఫాను వున్నయి. హనుమంతరావు పెట్టా, పరుపూ ఒక మూలవున్నయి, కమలకుర్చీలో కూచుంది. హనుమంతరావు మంచం మీద కూచున్నాడు

అరవకుర్రాడు, టిఫిన్ తీసుక వచ్చాడు, అన్నీ ఒక 'ట్రే' మీద అమర్చుకుని ఇద్దరూ టిఫిన్ తీసుకుని తమలపాకులు వేసుకున్నారు. హనుమంతరావు లేచి వెళ్లి, గదితలుపు మూసాడు. కమలకు అనుమానం వేసింది.

'ఇక మనం బజారుకు వెళదాం' అన్నది.

'కొంచెం సేపుండి వెళదాం. ఇప్పుడు చాలా యెండగా వుంది. నీతో అనేక సంగతులు మాట్లాడాలి. అసలు నేనీవూరు నీకోసమే వచ్చాను. మీ అమ్మా, నాయనా, రాత్రింబవళ్లు ఒకటే యేడుస్తున్నారు నీకోసం. మా వంశంలో ఏడు తరాలూ, అటు మీ నాయన వంశంలో ఏడుతరాలూ వెదకి చూచినా, ఇలాంటి పనిచేసినవాళ్లు లేరు. మీ అమ్మ, నువు గనుక ఇంటికి రాకపోతే, ఏ నుయ్యో, గొయ్యో చూచుకుంటుంది. నలుగురిలో తలెత్తుకుని తిరగలేక, మీ

నాన్నకూడా ఏమందో తిని చచ్చిపోతాడు'

'నేచేసినదాన్లో తప్పేముంది? నే నీవూరు ఏ దురుద్దేశ్యంతో నూరా లేదు. ఇక్కడ చదువుకుందామని వచ్చాను.'

'సంసారం చేస్తున్నదానికి, నీకు చదువేమిటి? చదువు కోవాలంటే, అక్కడవుండి, చదువుకోకూడదూ? పరాయి మొగాడితో లేచివచ్చి, పైగా చదువుకోడానికి వచ్చానని అబద్ధపుకూతలా? ఏమిటి వాడు నీకు చెప్పేచదువు? కామశాస్త్రమా?'

'ఏదో ఆయనకొచ్చింది చెవుతున్నాడు. మా అమ్మా నాన్నకూ, ఆయనకిచ్చి పెండ్లి చేసేటప్పుడులేని ఆపేక్ష నాయందిప్పుడు యేలా వచ్చింది? ఆ లావాటాయనతో నేపడ్డబాధ ఎవరికైనా తెలుసునా?'

'ఎందుకు తెలియాలి? గుట్టుచప్పుడు కాకుండా కొంపలోపడి వుండి, యేదైనా చేయాలిగాని, ఇలా ఇల్లు బయలుదేరి రావడం ఎంత నామర్దా! సంఘంలో ఎంత తలవంపులు! సంఘంలో ఎంతమంది లావాటివాళ్లులేరు? వుంటే, వాళ్ల ఆడవాళ్లందరూ ఇలా లేచి వెళ్తున్నారా? ఎంత తప్పుపని! నీకీ విషయం ఇప్పుడు బోధపడదు' అని నీతి బోధచేశాడు.

'ఇప్పుడంతా కబుర్లు చెప్పేవాళ్లేగాని, నా కష్టసుఖాలు గమనించినవాళ్లెవరు? పురుషులు తమ సౌఖ్యం కోసం పరస్త్రీలతో పోవటంలేదూ! ఆ హక్కు స్త్రీలకుమటుకు ఎందుకు వుండకూడదూ?'

'మన సంఘం ఇంకా అంత ఔన్నత్యానికి రాలేదు. మనం ప్రస్తుతంలో మన సంఘంలోవున్న ఆచారాలనుబట్టి నడుచుకోనాలి. ఏదో విపరీతమైన పనిచేస్తే నలుగురి నోళ్లల్లో పడతాం. నా మాటవిని, ఈ రాత్రిబండికి నాతో బయలుదేరిరా, బెజవాడ వెళదాం' అన్నాడు.

'బెజవాడ దేనికి?' అని అడిగింది అనుమానంతో.

'అక్కడకొన్నాళ్ళు వుండి, నీ భర్త దగ్గరకు వెళ్దువుగాని'

'నే నింకా కొన్నాళ్ళు యిక్కడే వుంటాను. నే నివాళ నీతో రాను.'

'మరెప్పుడు వస్తావు?'

'ఇంకో పదిహేనురోజులకు. ఈ లోపల వెళ్ళిపోతే, ఆయ నేమనుకుంటాడు. ఆయనెంత మంచివాడు. నాకోసం ఎన్ని అవస్థలైన పడడానికి సిద్ధపడి వచ్చేశాడు ఈవూరు.'

'నామాటవిని నావెంట బయలుదేరిరా, నువ్వుగనక రాకపోతే, నీ మొగుడు పోలీసురిపోర్టు యిస్తానన్నాడు. ప్రాక్టీసులేని ఒక ప్లీడరు, ప్రతిరోజూ ఇంటికివచ్చి, ఆయనకు చెబుతున్నాడు, వెంటనే కేసు పెట్టమని!

'ఆయ నేమంటున్నాడు?'

'ఏమంటాడు? నే నాయనకు చెప్పివచ్చాను. నేను మద్రాసునుంచి వచ్చేవరకు కేసు పెట్టవద్దని. నువ్వు గనక నావెంట వచ్చేస్తే, నువ్వు అసలు ఎవరితోనో లేచిపోయినట్లుకూడా ఎవరికీ తెలియదు. అందరూ, మేనమామగారింటికెళ్ళి వచ్చింది' అంటారు. తెలిసిందా? లేకపోతే, ఆయన కేసుపెట్టి వాడిదుంపా, నీదుంపా తెగేస్తాడు!

'ప్రయోజకత్వమే! నే బెజవాడ వచ్చినప్పుడు పిల్లలులేని కారణంచేత, జపానుబొమ్మను మూడురూపాయలకు కొని, దానికి చొక్కా తొడిగి, బొట్టుపెట్టి, రహస్యంగా ముద్దులు పెట్టుకుంటుంటే, నా అవస్థ ఎవరైనా గ్రహించారా? ఇప్పుడు నువ్వూ, ఆయనాకూడా యేకమై నా సౌఖ్యాన్ని పాడుచేయ సమకట్టారు. కానీయండి' అని కళ్లంబడి నీళ్ళు కార్చసాగింది. హనుమంతరావు లేచి, 'వూరుకో, ఏడవబోకు ఎందుకూ? ఏదో అయిందేదో, అయిపోయింది. వూరుకో' అని తన జేబుగుడ్డతో ఆమె చెక్కిళ్లుతుడిచి, ఓదార్చసాగాడు. ఆమె దుఃఖం ఆగలేదు. వెక్కివెక్కి ఏడవసాగింది. హనుమంతరావు,

'కమలా, వూరుకో అమ్మా! ఎందుకు? ఏడవకు రావద్దులే నీ యిష్టం వచ్చినప్పుడేరా, రావాలని వుంటే. లే వెళదాం' అన్నాడు. కమల, కుర్చీలోనుంచిలేచి కళ్లు తుడుచుకుని, అద్దంలో మొగం చూచునుంది. హనుమంతరావు కమలను అమాంతంగా తన రెండుచేతులతో గాఢంగా కావలించుకుపోయాడు. కమల 'మామయ్యా! నీకుగూడా యీదుర్బుద్ధి ఏమిటి? అని అతని కౌగిలినుంచి పెనగులాడనారంభించింది. అతను వదిలిపెట్టలేదు 'ఎందుకమ్మా, అలా పడ్డావు. నాగుండె తరుక్కుపోయింది. నీమీద ఆపేక్షవుండీ, నీ కిటువంటి వుద్దేశ్యాలు లేవనుకున్నాను!

'అబ్బ, వదిలిపెట్టు మామయ్యా పొరపాటున నీవెంట వచ్చా'

'నే వాడికంటే చెడిపోయాను. బుల్ డాగ్ మొగమూవాడూ! నీకు వా డెక్కడ దొరికాడు?' అని గట్టిగా తన వక్షానికి అదుముకుని ముద్దుపెట్టుకున్నాడు.

అయిదుగంట లైంది. ఇద్దరూ బజారుకుపోయి, చీరెలూ రెవికె గుడ్డలూ, పండ్లు కొని తీసుకువచ్చే టప్పటికి బాగా చీకటిపడ్డది. హనుమంతరావూ కమల ఇద్దరూ హోటల్లోనే భోజనం చేసారు.

'కమలా, ఎప్పుడు బయలుదేరి వస్తావో ఆరోజున నేనీవూరు వస్తాను'

'ఇంకో వారంరోజులువుండి వస్తాను అమ్మనూ నాన్ననూ, దిగులు పెట్టుకోవద్దని చెప్పు నే తప్పకుండా వస్తానన్నానని చెప్పు.'

హనుమంతరావు కమలను వెంట పెట్టుకుని, ఏడున్నరప్పుడు, రాయపేటలో కమల యింటివద్దకు వచ్చి దింపి, 'అమ్మాయి, నే వెళ్తున్నా' అన్నాడు.

## ౬

కమల, హనుమంతరావువెంట బజారుకు బయలుదేరి వెళ్లినప్పటి నుంచీ, విశ్వనాథం విచార సముద్రంలో మునిగిపోయి, తన భూత జీవితం గూర్చి విస్మరించసాగాడు. ఎంతమందో పిల్ల నిస్తామని వచ్చినప్పుడు వివాహం చేసుకోని కారణంచేత, తనలో నానాటికి స్త్రీవాంఛ ఎక్కువైపోయి, తిసీ పని చేయ సాహసించాడు. జవహర్ లాల్ నెహ్రూ, యం. న్. రాయి వాళ్ల మోస్తరుగా తనుకూడా దేశసేవ చేయాలని పెట్టుకున్న ఆదర్శాలన్నీ భగ్నమైపోయినయి. జీవితంలో స్త్రీ సౌఖ్యం తప్ప ఉన్నతమైనది లేదని కామాంధులై సంచరించే, సామాన్య మానవులలోకంటె యిప్పుడు తనలో ఆధిక్యత యేముంది?

హనుమంతరావు బీచిలో కన బడనంతవరకూ, విశ్వనాథం చింత లేమో యెరుగడు కమలయొక్క సౌఖ్యంలో రాత్రింబవళ్లు మగ్నమై, ఆనందజలధిలో ప్రవహించిన అతని హృదయం హనుమంతరావు వచ్చినప్పటినుంచీ, నిప్పుల మధ్యను వున్నట్లు అయింది. కమల యింటికి రాగానే ఆమెతో చెప్పి వెంటనే యిల్లు మార్చాలను కున్నాడు. సముద్రానికి దూరంగా మింటుస్ట్రీటులోనో, లేక మాంబలం లోనో కాపురం వుంటే, ఇకముందు యెవరూ తమకోసం మద్రాసు వచ్చినా, ఇల్లు కనుక్కో లేరు. ఈ మాటు హనుమంతరావు మద్రాసు వస్తే అతను గుర్తు పట్టకుండా వుండేలాగున గడ్డం పెంచాలనుకున్నాడు. క్రాపింగు తీసివేయించి పిలకపెట్టించుకుని నెత్తికి ఒక మహాత్మదీయుని టోపీ పెట్టుకోవాలనుకున్నాడు.

సాయంకాలం అయిదుగంటలకు కమల యింటికి రాకపోవడం వల్ల, విశ్వనాథం ఇంటికి తాళంవేసి, కాఫీ తీసుకొని ట్రిప్లికేన్ బీచికి వెళ్లి, అక్కడ ఏడుగండలదాకా వుండి, యింటికి వచ్చాడు. అప్పటివరకు కమలయింటికి రాకపోవడంచేత, విశ్వనాథం రకరకాలుగా ఆలోచించ సాగాడు. కమల కూడా అతనితో బయలుదేరి వెళ్లిపోయిందేమో? లేక కమలను అతను లోబరచుకొని ఎక్కడికైనా... ఉన్నాడేమో? ఏమిటో? ఎంతసేపటికి కమల రాకపోవడం వల్ల, కుంపటి వెలిగించి తన మట్టుకు బియ్యం కడిగి, దానిమీదపెట్టి కుంపటి విసరుతున్నాడు. అ సమయంలో కమల యింటికి వచ్చింది. హనుమంతరావు లోపలికి రాకుండా బయట వాడు, బయటినించే వెళ్లాడు.

లాంతర దీపముందు విశ్వనాథం కమలను పైనుంచి క్రిందకు ఒకసారి ఎగాదిగా చూచాడు. ఏమీ మాట్లాడలేదు. కమల,

'అప్పుడే, అన్నం వండడం, ప్రారంభించారేం? నే వండనూ?' అంది.

'నువ్వు అయిదింటికే వస్తానని, యెంతసేపటికి రాకపోతే, యిప్పుడే ప్రారంభించాను. అయిదుగంటలకు మీ మామయ్య నిన్ను రానివ్వ లేదా? అన్నాడు గంభీరంగా.

'రానివ్వక పోవడానికి అతని కేమి హక్కు వుంది? నేనే మాటలు మాట్లాడుతూండడం వల్ల చీకటి పడ్డది, అక్కడి సంగితులు యేవో యేవో చెబుతుంటే, వింటూ కూచున్నాను.'

'ఎక్కడ కూచున్నావు?'

'సర్దార్ భవనం హోటల్లో అతనక్కడ దిగాడు.'

'అలాగా. సంతృప్తి తీరా మాట్లాడి వచ్చావుకద?'

'అంటే? ఏమిటి వింతగా మాట్లాడుతున్నారు?'

'ఏమో, నీ కే తెలియాలి. నువ్వీ పూట, వింతగా లేవూ?'

'నేనేం వింతగా లేను' అన్నది కోపంగా.

అన్నం వుడికింది. కమల అన్నం దించి, విశ్వనాథానికి కంచంలో మధ్యాహ్నం చేసిన వంకాయ పచ్చడి, ఉల్లిపాయపులుసుతో భోజనం పెట్టింది. విశ్వనాథం,

'ఏం నువు భోజనం చెయ్యవూ?'

'నేను హోటల్లో భోజనం చేశాను.'

'నీకు విందుచేశాడు కావాల్ను.'

'ఏమో నాకు తెలియదు.'

విశ్వనాథం భోజనంచేసి లేచి చెయి కడుక్కొని, గదిలోకి వెళ్లాడు. కమల కూడా వెళ్లి పరుపుమీద కూర్చుంది.

'మధ్యాహ్నం రెండు గంటలకు వెళ్లి, ఏడున్నరకు వచ్చావు, యింత సేపు అక్కడ యెందుకున్నావు?'

'ఏం వుంటే?' అందులో తప్పేముంది?'

'అతనేం చేశాడో నాతో చెప్పవూ?' అన్నాడు ఎగతాళిగా. కమలకు కోపం వచ్చింది. 'అతను చాలా మంచివాడు అతను నన్నేమీ చేయలేదు. మీ బూరికే అనుమాన పడుతున్నార కాని.'

'ఏం చేయకుండా యెందుకుంటాడులే. నా దగ్గిరా నీ బొంకులు? నేనుమాత్రం తెలుసుకో గలను' అన్నాడు.

'ఏమిటి మీరు తెలుసుకున్నది?' అన్నది కమల ఏడుపు మొగంతో.

'పైగా యేడుస్తున్నావు. ఇంత వరకూ ఆతనితో యెందుకున్నావు? నువ్వు వెళ్తూ, నన్నుకూడా యెందుకు రమ్మనలేదూ? నాకు తెలుసు నేనస్తే, నీకు అడ్డం, అని'

కమల మాట్లాడలేదు. విశ్వనాథం అదే ధోరణిలో మాట్లాడ సాగాడు. చివరకు కమలకు బాగా కోపం వచ్చింది.

'అలా వెధవమాటలంటుంటే నే వూరుకోను.' అన్నది.

'ఏంచేస్తావు? కొడతావా?' అని దగ్గరకువెళ్ళి చంపమీద యీడ్చి కొట్టాడు. కమల లేచి వెళ్లి వసారాలో వున్న పింగాణీ కంచం అంటుది విసిరి విశ్వనాథం మొగాని కేసి కొట్టింది. అతను బయటికివచ్చి ఆమెను మొగంమీద వీపుమీద ఈడ్చి గుద్దాడు. కమల పెద్దపెట్టున పెద్దగొంతుతో ఏడవసాగింది. చుట్టు ప్రక్కలనున్న యిండ్లవాళ్ళు లేచి వచ్చి, ఇద్దరినీ సర్దారు. వాళ్ళు అరవంలో, ఏమిటికారణం ఇలా కొట్టుకోడానికి అని యెన్ని సార్లు అడిగినా, విశ్వనాథం తెలుగులో వాళ్లకు ఎన్నిసార్లు చెప్పినా, ఒకరిమాటలు ఒకరికి తెలిసినయి కావు. మనకెందుకని, కొంతసేపయిం తరవాత వాళ్లదోవను వాళ్ళు వెళ్ళిపోయారు.

కమల తెల్లవార్లూ నిద్రపోలేదు విశ్వనాథంమటుకు తనలో తాను పశ్చాత్తాపపడుతూ గదిలో పడుకున్నాడు. విరహవహ్నిలో కృశించి పోయిన తనకు స్వర్గసౌఖ్యాలన్నీ కరతలాఽమలకంగా చేసిన కమలను, కొద్ది గంటల ఆలస్యం చేసిందని, తనలా, ఆమెను శిక్షించడానికి తనకేమి అధికారంవుంది? సంఘ సంస్కారంలో పనిచేయాలనుకున్న తనకింత తామసమూ, అహంకారమూ వుంటే, తనేమి చేయగలడు?

ఉదయం 6 గంటలకు కమలకు నిద్ర మెలకువ వచ్చింది. విశ్వనాథం గాఢంగా నిద్రపోతూన్నాడు. అతను మామూలుగా ఏడున్నరకు గాని నిద్రలేవడు. కమల కాలకృత్యాలు తీర్చుకుని, త్వరగా జెడవేసి కొని, తను మద్రాసులో కొన్న చీరెలు, బాడీలు, జాకెట్లు చిన్న సూట్ కేసులో సర్దింది. విశ్వనాథం చొక్కా జేబులోని మనీపర్సు తీసింది. అందులో సమారు ఇరవై రూపాయీలు, పైన కొద్దిగా చిల్లర వుంది. కమలు ఒక పదిరూపాయల నోటు, ఒకపావలా డబ్బులు తీసి కొని సూట్ కేసు తీసికొని, అతను నిద్రలేవ ముందే, బయలుదేరి స్టేషనుకు వెళ్ళి పోయింది.

విశ్వనాథం ఎనిమిది గంటలకు నిద్ర లేచి, కమలకోసం యిల్లు అంతా వెదికాడు, ఎరిగినవాళ్లను ఆమె జాడనుగూర్చి అడిగాడు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. తన మనీపర్సు తీసి చూసుకున్నాడు. అందులో ఇరవై రూపాయిలకు పదిరూపాయిలు మాత్రం వున్నవి. అందులో అతను యిబ్బంది పడతాడని పదిరూపాయిలు వుంచిపోయింది కమల. విశ్వనాథానికి పట్టరానిదుఃఖం వచ్చింది. పర్సులోవున్న డబ్బంతా తీసుకపోకుండా, తనకోసం కొంత డబ్బు వుంచింది ఆస్థితిలో కూడా, ఆమె నిర్మలమైన ప్రేమ అతని హృదయాన్ని కదల్చింది. రాత్రి తనామెను కొట్టినందుకు అనేక విధాల పశ్చాత్తాపపడ్డాడు. అంత వరకు తను స్త్రీకోసం పడ్డ బాధంతా, ఒక్కసారిగా మళ్లీ ఎదుట సాక్షాత్కరించింది.

ఒకప్పుడు తెన్ను ఒక నలభై యేళ్ల వితంతువు ప్రేమించి, తన యింటికి ఆహ్వానిస్తే, తను ఆమె జోడీకుండు, వికృతమైన దేహాన్నీ గుంటలుపడ్డ నేత్రాలనీ, చూచి అసహ్యాపడకుండా ఆమెకోసం ఆశపడి వెళ్లితే, ఆమె మరది తన్నాడు. ఆరోజున తను చావుతప్పి కన్నులొట్టపోయి బయటపడ్డాడు. తన జీవితంలో తలవని తలంపుగా కమలతో ఏర్పడిన ఇంత ఆనందమైన ఘట్టం యింకరాదని నిస్పృహ చెందాడు. ఆరోజల్లా కమల జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, చిన్న పిల్లాడి మోస్తరుగా దుఃఖించాడు. ఇక ఈ జీవితం యెందుకు? మరణిస్తే భూమికీ ప్రపంచానికీ లోటేమిటి? అని ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకున్నాడు.

అంతకుముందే, జీవితంలో అనేక కష్టాలు అనుభవించి వుండడంవల్ల ఎలాగో, అతను దుఃఖాన్ని అణచుకోగలిగాడు. రెండురోజులు మద్రాసులోనే యేమీతోచక పిచ్చివాడి వలె బజార్ల వెంబడి తిరిగాడు. వూరు వెళ్లి, అక్కడ తనకున్న యావదాస్తిని అమ్మి, అప్పులు తీర్చివేసి, మద్రాసులో స్థిరావాసం యేర్పరచుకోవాలనుకున్నాడు. వెంటనే బయలుదేరి తెనాలి వెళ్ళి, అక్కడ కమల వుందేమోనని విచారణచేస్తే, కమల వూళ్లో లేదని తెలిసింది. విశ్వనాథం తనింక యిటువంటి ప్రణాయుగాధలలో దిగితే జీవితం పూర్తిగా నాశమైపోతుందని, తన పనులు చూచుకుని, సామానుతో మద్రాసు చేరుకున్నాడు. హిందూ పేపరు అడ్వర్టైజుమెంట్లను బట్టి, ఒక మ్యాయుని పెళ్ళి చేసుకోవడానికి స్థిరపరుచుకున్నాడు. ఆమె బాలవితంతువు, సుమారు 2 వత్సరాలుంటయి ఒక మోస్తరు నల్లని అందకత్తె.

పొలం అమ్మగా, అప్పులుపోగా నాలుగువేల రూపాయలు మిగిలినయి. వాటితో ఒక ముద్రణాలయం కొని, ఒక మాసపత్రికను ప్రకటించ ప్రారంభించాడు.

౨

ఆరు సంవత్సరాలు గడచిపోయినయి. ఈ ఆరు సంవత్సరాలలో విశ్వనాథానికి కమలనుగాని, కమలకు విశ్వనాథానినిగాని చూడడం తటస్థించలేదు. ఒకరికొకరికి ఉత్తరప్రత్యుత్తరాలు కూడా లేవు.

విశ్వనాథం డిసెంబరులో పదిరూపాయిల టికెట్టుతీసికొని పత్రికా ప్రచారంకోసం, తెనాలి వచ్చాడు. అతనికి కమలను చూడలనిపించింది. ఆమె మాట్లాడినా, మాట్లాడకపోయినా, దూరాన్నుంచి ఒకసారి చూచిపోవాలనుకున్నాడు.

ఉదయం తొమ్మిది గంటలవేళ కమల యింటికి సమీపంలో రోడ్డు మీద, ఒక పూర్వపరిచితుడితో, మాట్లాడుతూ విశ్వనాథం కమల యింటివైపు చూస్తూ నిలబడ్డాడు. ఆమె యెప్పుడైనా బయటికి వస్తుందేమోనని. కొంతసేపటికి, ఆ యింట్లోనుంచి, ఒక స్త్రీ, ఆమెతో ఒక చిన్నపిల్ల వయసు సుమారు ఆరేళ్ళుంటయి-వసారాలోకి వచ్చారు. కమల విశ్వనాథాన్ని దూరాన్నుంచే గుర్తుపట్టింది. విశ్వనాథం ఆమెనుగుర్తించ

లేక పోయాడు. ఆమెవైపే తదేక దీక్షతో చూడసాగాడు. కొంత సేపటికి, ఆ చిన్నపిల్ల అతనివద్దకు వచ్చి,

'బాబాయ్, మా యింటికి రావూ!'

'మీయింటికి నేనుదేనికి? ఎవరమ్మాయివి నువ్వు? మీ అమ్మ పేరేమిటి?' అని నలుడు కుమారుడ్ని ప్రశ్నించినట్లు ప్రశ్నించాడు ఆపిల్ల మొగం తన ముఖంవలె ఉండడం వల్ల అతనకి యెక్కువ ఆశ్చర్య కలిగింది.

'కమలమ్మ బాబాయ్, మా యింటికి రమ్మంది' అన్నది ఆపిల్ల. విశ్వనాథం మారుమాటాడక ఆ పిల్లతో కమలయింటికి వెళ్లాడు. మధ్య హాలులోవున్న కుర్చీమీద కూర్చున్నాడు. కమల' ఏమండీ! ఎప్పుడొచ్చారు ఈవూరు?

విశ్వనాథం:-నిన్న సాయంత్రం.

కమల:-చాలా మారిపోయారు.

వి:-నేను నిన్నసలు గుర్తుపట్టలా! మీ అమ్మాయి నీ పేరుచెపితే, అప్పుడు తెలుసుకున్నా.

క:-అమ్మాయికి అన్నీ మీ అలవాట్లే (పిల్లతో) బాబాయి దగ్గరికి పో అమ్మా! చూస్తారు.' అన్నది.

ఆపిల్ల విశ్వనాథం దగ్గరికివచ్చి, 'బాబాయ్, నువ్వు మాయింట్లో అన్నంతినవూ? మా యింట్లో నే, పెద్ద కుక్కబొమ్మ వుంది! అన్నది. విశ్వనాథం ఆపిల్లను దగ్గరకు తీసికొని, జేబులోనుంచి ఒక్కపావలా తీసి, చేతిలోపెట్టి, 'నీ పేరేమిటమ్మా? అన్నాడు. పిల్ల కొంచెం సిగ్గుపడింది. కమల చెప్పమ్మా సిగ్గెందుకూ, బాబాయేగా!' అన్నది.

'ఇందిర' అన్నది పిల్ల.

'కమలా, మంచిపేరు పెట్టావు నీ కూతురికి, చాలా బాగుంది'.

'పిల్ల బాగుండలేదూ? దాన్ని చూసినప్పుడల్లా, మీరు జ్ఞాపకం వస్తుంటారు. ఇన్నాళ్ళనుంచీ, ఈ వూరు ఒక్కసారిగూడా రాకుండా, మద్రాసులో ఏం చేస్తున్నారు. ఏదో పత్రిక అచ్చువేయిస్తున్నారటగా!' అన్నది.

'అవును'

'పెళ్ళి చేసుకున్నారా?'

'ఆ, చేసుకున్నా ఇద్దరు మగపిల్లలుకూడా!'

'మీవాళ్ళనికూడా ఒకసారి ఈ వూరు తీసుక రాకపోయారూ? నేగూడా చూసేదాన్ని' అన్నది.

కమల పిల్లనుపంపి కాఫీహొటలు నుంచి కాఫీ తెప్పించింది. విశ్వనాథం కొద్దిగా త్రాగి, పిల్లకు యిచ్చాడు మిగిలినది.

'నే వెళ్తా' అని కుర్చీలోనుంచి లేచాడు.

'వెళ్ళడమేమిటి? రాకరాకవచ్చారు. ఇవాళ వుండండి. ఆయన వూళ్ళో లేరు. ఏదో పనిమీద పొరుగూరు వెళ్లారు' అన్నది చిరునవ్వు మొగంతో. విశ్వనాథం ఆహ్వానం అంగీకరించాడు. ఆరోజు ఆమెతో గడిపి పోవాలనుకున్నాడు.

* * *

ప్రక్క యింట్లోవున్న, మేష్టరు భార్య బజారుకు తడిగుడ్డ కట్టుకుని మంచినీళ్ళు పట్టుకవస్తూ, ప్రక్కచూపులతో విశ్వనాథాన్ని చూచి, యింట్లోకివచ్చి, కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుతూన్న భర్తతో అన్నది:

'సుబ్బారాయుడు గారింటికి, అచ్చం, వాళ్ళమ్మాయి పోలికగా వున్నాడు, ఎవరో చుట్టం వచ్చాడు. మీరు వెళ్ళి చూసిరండి ఆయనెవరో! ఆవిడగారు చాలా చనువుగా మాట్లాడుతోంది'! ఆమె భర్త వెళ్ళి చూచివచ్చి,' 'ఇంకా సందేహం యెందుకూ? ఆయన ఆయనే!' అన్నాడు.

